

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం

19 నవంబర్ 2025 పేజీలు : 08


### భగవంతుని సేవలో అధికారులు

# చిత్తశుద్ధితో పని చేయాలి

- సమాజ హితం కోసం పని చేసే శాఖ దేవాదాయ శాఖ
- అధికారం చేపట్టిన 18 నెలల్లో అనేక సంస్కరణలతో దేవాదాయ శాఖ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టాం
- రాష్ట్రంలో ఆలయాలను ఆధ్యాతిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యం
- రూ.కోట్లతో పురాతన ఆలయాల పున:నిర్మాణ పనులు
- దేవాదాయ శాఖ సమీక్షలో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :**

నెల్లూరు సంతపేటలోని క్యాంపు కార్యాలయంలో నెల్లూరు జిల్లాలోని దేవాదాయ శాఖ అధికారులు, ఇంజనీర్లు, స్తపథులతో మంగళవారం ఉదయం మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. భక్తులకు దేవాదాయశాఖపై నమ్మకం, భగవంతునిపై ప్రగాఢ విశ్వాసం కలిగించేలా దేవాదాయ శాఖ అధికారులందరూ భగవంతుని సేవలో చిత్తశుద్ధితో పనిచేస్తూ, ఆలయాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. జిల్లాలోని ఆలయాల పునర్నిర్మాణ పనులు, ధూపదీప నైవేద్యం

-మిగతా 2లో

### వైకుంఠ ద్వార దర్శనాల్లో సామాన్య

# భక్తులకు ప్రాధాన్యత

- మొదటి 3 రోజులకు ఆన్‌లైన్‌లో ఈ-డిప్ ద్వారా టోకెన్లు జారీ
- చివరి 7 రోజులు వైకుంఠం-2 ద్వారా వైకుంఠ ద్వారా దర్శనాలు
- అన్నమయ్య భవన్‌లో జరిగిన టీటీడీ బోర్డు మీటింగ్
- పాల్గొన్న కోవూరు ఎమ్మెల్యే, బోర్డు సభ్యురాలు ప్రశాంతిరెడ్డి



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు డిసెంబర్ 30 నుంచి జనవరి 8 వరకు నిర్వహించనున్న 10 రోజుల వైకుంఠ ద్వార దర్శనాల్లో సామాన్య భక్తులకే ప్రాధన్యతనిస్తున్నట్లు టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడు వెల్లడించారు. వైకుంఠ ద్వార దర్శన విధి విధానలపై మంగళవారం ఉదయం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో టీటీడీ చైర్మన్ బి.ఆర్ నాయుడు అధ్యక్షతన ఈఓ అనిల్ సింగాల్‌తో కలిసి ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కోవూరు ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

-మిగతా 2లో

# జాతీయస్థాయి అవార్డు

### అందుకున్న కలెక్టర్ హిమాన్షు శుక్ల




దేశస్థాయిలో పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**

దేశస్థాయిలో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ప్రత్యేక గుర్తింపు పొందింది. జల్ సంచయ్ జన్ భగీదారీ కార్యక్రమంలో భాగంగా వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాల పెంపుతోపాటు జల సంరక్షణలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల నేతృత్వంలో అధికారుల పనితీరుకు జాతీయస్థాయిలో అవార్డు లభించింది. మంగళవారం న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర జల శక్తి మంత్రి సిఆర్ పాటిల్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

-మిగతా 2లో

# కూలిన కల్వర్టు

## స్తంభించిన రాకపోకలు

- మొంథా తుఫాన్ సమయంలో కుంగిన కల్వర్ట్..
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు
- నేడు కల్వర్ట్ పూర్తిగా కూలిపోయి నిలిచిన రాకపోకలు



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :**

కల్వర్ట్ కూలి వాహన రాకపోకలు నిలిచిపోయిన సంఘటన పొదలకూరు – రాపూరు రహదారిలో డేగపూడి రాజుపాలెం వద్ద మంగళవారం సాయంత్రం చోటు చేసుకొంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షాలతో పొదలకూరు మండలంలోని డేగపూడి రాజుపాళెం వద్ద రహదారిపై ఉన్న కల్వర్టు వాహనాల తాకిడికి కూలిపోయింది. దీని కారణంగా రహదారి పూర్తిగా చెదిరిపోయి వాహన రాకపోకలు నిలిచిపోయాయి. మొంథా తుఫాన్ సమయంలో ఈ కాల్వర్ట్ కుంగి ప్రమాదభరితంగా తయారైంది. కల్వర్ట్ కూలిపోకముందే చర్యలు చేపట్టాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు సమస్యను పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం కల్వర్ట్

-మిగతా 2లో




## ట్రాఫిక్ మళ్లింపు

పొదలకూరు నుండి రాపూరు వెళ్లే వ గత ఇటీవల కురిసిన భారీ వర్షాలు, పాత నిర్మాణం కావడం వల్ల పొదలకూరు మండలం డేగపూడి గ్రామం వద్ద నుండి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాత కల్వర్టు మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు కుంగిపోయింది. ఈ క్రమంలో సంబంధించిన విభాగాల అధికారులు సమన్వయంతో మరమ్మత్తులు చేపడుతున్నారు. కావున పొదలకూరు నుండి

-మిగతా 2లో

# కూలిన కల్వర్టు - స్తంభించిన రాకపోకలు





*(మొదటి పేజీ తరువాయి)*

పూర్తిగా కూలిపోయి రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్అండ్బీ అధికారుల నిర్లక్ష్యమే ఈ కల్వర్టు కూలిపోవడానికి కారణమని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఈ రహదారిలో ప్రతినిత్యం రాజంపేట, రాపూరుల నుంచి పొదల కూరు మీదుగా నెల్లూరుకు వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కల్వర్ట్ కూలిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన కల్వర్ట్ నిర్మాణం చేపట్టి రాకపోకలను పునరుద్ధించాలని స్థానికులు కోరుతున్నారు.




### ట్రాఫిక్ మళ్లింపు :

రాపూరుకు వెళ్లే వాహనదారులు ప్రజలు గమనించి.. పొదలకూరు నుండి రాపూర్ పోదలచిన వారు, డేగపూడి దగ్గర ఎడమ వైపుకు తిరిగి సైదాపురంకు వెళ్లి, అక్కడి నుండి కుడివైపుకు తిరిగి రాపూరు వెళ్లాలని అధికారులు సూచించారు. అదేవిధంగా కండలేరు నుండి పొదలకూరు వెళ్లేవారు కండలేరు నుంచి పులికల్లు గ్రామం మీదుగా ఆదూరుపల్లి నుండి పొదలకూరుకు వెళ్లాలన్నారు. వాహనదారులందరూ గమనించి సహకరించాలని కోరారు.

# భగవంతుని సేవలో అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి

*(మొదటి పేజీ తరువాయి)*

పథకం అమలు, గ్రామ దేవతల ఆలయాల నిర్మాణాలపై చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ.. గడిచిన ఐదేళ్లలో ఆలయాల ప్రతిష్ట దిగజారిందని, మళ్లీ తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన 18 నెలల్లోనే ఆలయాల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టి, ఆలయాల పవిత్రతను కాపాడుతూ.. భక్తులకు భగవంతుని సాక్షాత్కారం చేయడమే ఆలయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారం చేపట్టిన వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా ధూపదీప నైవేద్యం స్కీం ద్వారా చిన్న ఆలయాలకు ఇస్తున్న రూ.5వేల నగదును రూ.10వేలకు పెంచి అందిస్తున్నట్లు చెప్పారు. ఆలయాల్లోని అర్చకులకు రూ.10వేలు నుంచి రూ.15వేలు పెంచి అందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 27 వేల ఆలయాలున్న మంత్రి, ప్రతి ఆలయం బాధ్యతను ప్రభుత్వం తీసుకుని, ఆ ఆలయాల ఆలనాపాలన చూస్తుందన్నారు. ఆలయాలకు పాలకవర్గాలను కూడా నియమిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం నియమించిన పాలకవర్గాల గడువు సమయం తీరే వరకు కూడా ఆ పాలక వర్గాలనే కొనసాగించాలని సీఎం చంద్రబాబునాయుడు సూచించారని చెప్పారు. కక్ష సాధింపు చర్యలకు తమ ప్రభుత్వం పాల్పడదని, ప్రోత్సహించదని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు.



**కాశీబుగ్గ తరహా ఘటనలు జరగకుండ చర్యలు:**

కాశీ బుగ్గ తరహా ఘటనలు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ప్రైవేటు ఆలయ నిర్మాణాలపై దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణ ఉండేలా త్వరలోనే చట్టం తీసుకొస్తున్నట్లు మంత్రి చెప్పారు.

**ఆలయాల్లో ఏ తప్పులు జరిగినా శిక్షలు తప్పవు :**

భగవంతుని ఆరాధ కేంద్రాలైన ఆలయాల్లో ఎవరు ఎటువంటి తప్పులు చేసిన శిక్షలు తప్పవని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. ఆగమశాస్త్ర విషయాల్లో కేవలం వేదపండితులు, ఆలయ అర్చకులకే పూర్తి నిర్ణయాధికారులు ఉంటాయని, అధికార యంత్రాంగానికి స్థానం లేదని, కేవలం పరిపాలనాపరమైన అంశాల్లో మాత్రమే అధికారుల ప్రమేయం ఉండేలా చట్టం తీసుకొచ్చినట్లు చెప్పారు. తిరుమల కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరుని ఆలయంలో కల్తీ నెయ్యి, పరకామణి దోపిడీ విషయాల్లో గత ప్రభుత్వ పాలకుల అక్రమాలు వెలుగుచూశాయని, ఇకనైన బాధ్యతగా ప్రవర్తించాలని హితవు పలికారు.

**రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల పునర్నిర్మాణ పనులకు నిధులు మంజూరు :**

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పురాతన, చారిత్రాత్మక ఆలయాల పునర్నిర్మాణాలకు కోట్లాది రూపాయలను మంజూరు చేసినట్లు చెప్పారు. గత 15 ఏళ్లలో 210 ఆలయాలకు 234 కోట్లు మంజూరు చేస్తే, తమ ప్రభుత్వం కేవలం ఈ 18నెలల పాలనలో 288 ఆలయాలకు 221 కోట్లను మంజూరు చేసినట్లు చెప్పారు. గతంలో ఉన్న పాతవి, తాము మంజూరు చేసినవి అన్నీ కలిపి సుమారు 498 ఆలయాల అభివృద్ధికి 603 కోట్ల రూపాయలను దేవాదాయశాఖ, దాతల సహకారంతో ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు.

**జిల్లాలో 58 ఆలయాల్లో పునర్నిర్మాణ పనులు :**

నెల్లూరు జిల్లాలో 58 ఆలయాల పునర్నిర్మాణ పనులు చేపడుతున్నట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఒక్క నెల్లూరుజిల్లాలోనే 118.45 కోట్ల నిధులను ఆలయాల అభివృద్ధికి ఖర్చు చేస్తున్నామని మంత్రి చెప్పారు. సోమశిల సోమేశ్వరస్వామి, అమ్మవారి ఆలయాలు, నెల్లూరు వేణుగోపాలస్వామి, నవాబుపేట శివాలయం, ఇరుకళల అమ్మవారి ఆలయం, రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం, ఉదయగిరిలోని వేణుగోపాలస్వామి ఆలయం, నర్రవాడ వెంగమాంబ ఆలయం, బిట్రగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రత్యేకంగా ఎస్సీ ఎస్టీ బీసీ కాలనీలలోని గ్రామదేవతల ఆలయాలు, రామాలయాల నిర్మాణాలు, మరమ్మతులకు 5 లక్షలు చొప్పున 78 ఆలయాలకు నిధులు మంజూరు చేశామని, వీటి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సమీక్షలో జిల్లా దేవాదాయశాఖ అధికారి కోవూరు జనార్ధన్‌రెడ్డి, అన్ని ఆలయాల కార్యనిర్వహణ అధికారులు, ఇంజనీర్లు, స్తపథులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి అవార్డు అందుకున్న కలెక్టర్ హిమాన్షు శుక్ల

*(మొదటి పేజీ తరువాయి)*

జాతీయస్థాయి అవార్డు అందుకున్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ గంగాభవాని కూడా అవార్డు స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు.

**5502 జల సంరక్షణ పనులు సమర్థవంతంగా చేపట్టినందుకు జాతీయస్థాయిలో అవార్డు :**

నీటి సంరక్షణ కార్యక్రమాల్లో విశిష్ట ప్రతిభ కనబర్చిన నెల్లూరు జిల్లాకు దేశ స్థాయిలో జల్ సంచయ్ జన్ భగీదారి 1.0 జాతీయస్థాయి అవార్డు లభించింది. జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకమైన జల్ సంచయ్ జన్ భగీదారీ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేసినందుకు, నీటి భద్రతతో కూడిన భవిష్యత్తు కోసం నీటి సంరక్షణ సమర్థవంతంగా అమలు చేసిన నేపథ్యంలో సౌత్ జోన్‌లో జిల్లాకు ఈ పురస్కారం లభించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నెల్లూరు జిల్లాలో ఉపాధి హామీ పథకం క్రింద ఫారం పాండ్లు 856, ఇంకుడు గుంటలు 3,495, ఊట చెరువులు 112, చెక్ డ్యాంలు 166, డగౌట్ పాండ్లు.. వాటర్ హార్వెస్టింగ్ పాండ్లు 512, రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు 54, రింగ్ ట్రెంచులు 12, సరిహద్దు కందకాలు 34, నీటి నిల్వ కందకాలు 14, చెరువుల పూడికతీత పనులు 247.. మొత్తం 5,502 భూగర్భ జలాల రీఛార్జ్ పనులు చేపట్టడం ద్వారా ఈ అవార్డును సాధించారు. జల్ సంచయ్ జన్ భగీదారి అంటే ప్రభుత్వ యంత్రాంగం సమష్టిగా పనిచేసి ప్రతి నీటి చుక్కను సంరక్షించడం, భవిష్య త్తు తరాల కోసం నీటి భద్రతను కాపాడడానికి నీటి సంరక్షణలో ప్రజల భాగస్వామ్యంగా జరిగిన ఈ కార్యక్రమాల ద్వారా వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల రీఛార్జ్, నీటి కొరత నివారణ, ప్రజల్లో నీటి ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించడం జరిగింది.

## వైకుంఠ ద్వార దర్శనాల్లో సామాన్య భక్తులకు ప్రాధాన్యత



*(మొదటి పేజీ తరువాయి)*

పాల్గొని వివిధ అంశాలపై చర్చించారు. డిసెంబర్ 30 నుండి జనవరి 8వ తేది వరకు 10 రోజులకు గాను 182 గంటల దర్శన సమయంలో దాదాపు 164 గంటల దర్శనం సామాన్య భక్తులకు కేటాయిస్తున్నట్లు చెప్పారు. మొదటి మూడు రోజులు శ్రీవాణి దర్శనాలను, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనాలు రద్దు చేస్తున్నామన్నారు. ఈ పది రోజుల పాటు శ్రీవారి ఆలయంలో ఆర్జిత సేవలు, ప్రివిలేజ్ దర్శనాలు రద్దు చేస్తున్నామని పేర్కొన్నారు. స్వయంగా వచ్చే ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా సిఫార్సు లేఖలు స్వీకరించబడవని, మొదటి మూడు రోజులకు అన్ని టోకెన్లు కేవలం ఆన్‌లైన్ ఈ-డిప్ ద్వారానే కేటాయింపు జరుగుతుందన్నారు. రిజిస్ట్రేషన్లలో పారదర్శకత పాటించేందుకు మొదటి మూడు రోజులకుగాను భక్తులు టీటీడీ వెబ్‌సైట్, మొబైల్ యాప్, వాట్సాప్ ద్వారా ఈ-డిప్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, తెలుగు, తమిళ్, కన్నడ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉందన్నారు. నవంబర్ 27 నుండి 1వ తేది వరకు భక్తులు టోకెన్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని వెల్లడించారు. జనవరి 6, 7, 8 తేదీల్లో రోజుకు 5 వేల టోకెన్ల చొప్పున స్థానికులు ఫస్ట్ ఇన్ ఫస్ట్ ఔట్ పద్ధతిలో బుక్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని పరకామణి కేసును నిష్పక్షపాతంగా విచారణ చేసి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి నివేదించేందుకు బోర్డు నిర్ణయించింది. ఈ కేసులో ఎంతటి వారున్నా బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేయాలని తీర్మానం చేశారు. ఈనెల 27వ తేదిన అమరావతిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో రెండో ప్రాకారం నిర్మాణానికి భూమిపూజలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారని పేర్కొన్నారు.

# విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** విద్యార్థులు సెల్ ఫోన్ వినియోగానికి దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. ఆయన మంగళవారం స్థానిక ప్రగతి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు ఎక్కువవుతున్నాయన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్లో పంపే వివిధ లింకులను ఫోన్ వినియోగదారులు ఎవరు ఓపెన్ చేయకూడదు అన్నారు. వాట్సప్ డీపీలలో ప్రత్యేకత ఫోటోలు ఉంచకోరాదు అన్నారు. విద్యార్థులు కళాశాలలో పాఠశాలలో క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకొని ప్రయోజకులు కావాలన్నారు. సెల్ ఫోన్లు వాడుక లోకి వచ్చిన తర్వాత యువత పెడద్రోవ పడుతున్నదన్నారు. అవసరం ఉన్నంత వరకే సెల్ఫోను వినియోగించు కోవాలన్నారు. మైనర్ తీరకుండా వాహనాలు నడిపితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో కెనరా బ్యాంకు మేనేజర్ జయదేవ్ ,ప్రిన్సిపాల్ భాస్కర్, కరస్పాండెంట్ మైనుద్దీన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# 175 నియోజకవర్గాల్లో రైతుల పండుగ నేడే

## అన్నదాతసుఖీభవ నిధుల విడుదల : మంత్రి ఆనం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో రైతులకు పండుగ బుధవారమని, అన్నదాత సుఖీభవ 2వ విడత నిధులు విడుదలవుతాయని రాష్ట్ర దేవాదాయశాఖా మాత్యులు ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆయన మంగళవారం తమ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అన్నదాత సుఖీభవ, ప్రధానమంత్రి కిసాన్ యోజన, విశాఖపట్నం సమ్మిట్ విజయవంతం తదితర అంశాల గురించి మాట్లాడారు. బుధవారం కడపజిల్లా కమలాపురంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనిధులను రైతుల ఖాతాల్లో జమచేస్తారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 46.22లక్షలమంది రైతులకు 3077కోట్ల రూపాయల నిధులు విడుదల చేస్తారన్నారు. నెల్లూరు జిల్లాలో 1,95,866మంది రైతులకు 130.20 కోట్ల రూపాయల నిధులు జమచేస్తారన్నారు. ఈనిధులను సకాలంలో తమ ప్రభుత్వం విడుదల చేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు మొదటి ఏడాదిలోనే రైతులకు అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్‌యోజన పథకాలద్వారా తొలివిడతగా 46,22,904 మంది రైతులకు 7వేలరూపాయల వంతున జమచేయగా రెండవ విడత 3077కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమచేయనున్నామన్నారు. తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరు నుండి ప్రధానమంత్రి నరేంద్రమోడీ రైతులకు నగదును విడుదల చేయనున్నారని మంత్రి ఆనం వివరించారు. తాను బుధవారం ఆత్మకూరులోని శ్రీధర్ గార్డెన్స్ లో ఈపథకంద్వారా ఆత్మకూరు నియోజకవర్గంలోని 34223మంది రైతులకు 22.95కోట్ల రూపాయల నిధులను రైతుల ఖాతాల్లో జమచేస్తామని విశాఖపట్నం సిఐఐ సమ్మిట్‌తో రాష్ట్రానికి పెట్టుబడుల వరద వస్తుందని, రెండు రోజుల్లో 613ఒప్పందాలు 13.25 లక్షలకోట్ల రూపాయల పెట్టుబడులు రానున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనాదక్షతతో రాష్ట్రానికి పెట్టుబడులు వరదలా వస్తున్నాయని, ఇది 16నెలల సిఎం కృషి అని మంత్రి ఆనం వెల్లడించారు. సిఐఐసమ్మిట్‌కు ఒకరోజు ముందే 3లక్షలకోట్లకు పైగా పెట్టుబడులు రావడం, సంతకాలు జరిగిపోవడం గర్వకారణంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఎన్నడూలేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సిఐఐ సమ్మిట్‌లో 13,25,716లక్షల కోట్లు రూపాయలు ఎంఓయులు కుదుర్చుకోవడం ఒక చరిత్రగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ సహకారం, సీఎం చంద్రబాబు ఇమేజ్, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారాలోకేష్‌లు పెట్టుబడిదారులతో నిరంతరం జరిపిన సంప్రదింపులతో ఇది సాధ్యమైందన్నారు. చంద్రబాబు దూర దృష్టితో ఏపి మళ్ళీ దేశంలోనే నెంబర్1 అవుతుం దన్నారు. ఈపెట్టుబడుల ద్వారా దాదాపు 16లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆనం పేర్కొన్నారు. గత ప్రభుత్వ విధానంతో రాష్ట్ర వదిలివెళ్ళిపోయిన పరిశ్రమలు తిరిగి రాష్ట్రానికి వస్తున్నాయంటే చంద్రబాబు పాలనానైపుణ్యమని ఆయన తెలిపారు. విశాఖసమ్మిట్ స్పూర్తితో 2029నాటికి స్వర్ణాంధ్ర లక్ష్యసాధన సాకారమవుతుందని రామనారాయణరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నియోజకవర్గ నాయకుడు తాళ్ళూరు గిరినాయుడు, ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఛైర్మెన్ అరికట్ల జనార్ధన్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే కంచర్ల శ్రీహరినాయుడు, ఆత్మకూరు మండల తెలుగుదేశం అధ్యక్షుడు సుంకర పెంచలచౌదరి, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కళాశాలలో దీక్షారంభం కార్యక్రమం ప్రారంభం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని మేకపాటి గౌతం రెడ్డి వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ వ్యవసాయంలో ప్రవేశం పొందిన విద్యార్థిని, విద్యార్థులకు మంగళవారం దీక్షారంభం కార్యక్రమాన్ని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయ నిధుల సంఘం ద్వారా 2019 నుంచి ఈ కార్యక్రమం అమలు చేయబడుతున్నదన్నారు. విద్యార్థుల్లో కళాశాల యొక్క సామాజిక విలువలను తెలుసుకోవడానికివివిధ విభాగాల ద్వారా నేర్పబడుతున్న విద్యా ఆవశ్యక అంశాలను తెలుసుకోవడానికివిశ్వవిద్యాలయ విద్యార్థి నడవడికకు వసతిగృహ సంబంధమైన నియమనిబంధనలను తెలుసుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగ అధిపతులు డా.టి.గోపికృష్ణ, డా.వై.లావణ్య కుమారి, డా.ఏం.కిషన్ తేజ్, డా. ఏవీఎస్ దుర్గా ప్రసాద్, అధ్యాపకులు, పరిపాలన అధికారిణి కె.కమలప్రియ అధ్యాపకేతర సిబ్బంది, నూతన విద్యార్థులు పాల్గొన్నారు.

## వైసీపీ కోటి సంతకాల సేకరణ

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** మెడికల్ కాలేజీల మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వింజమూరులోని బంగ్లా సెంటర్ నందలి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఉదయగిరి నియోజకవర్గ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఒంగోలు రాఘవేంద్ర జిల్లా అధికార ప్రతినిధి ఇర్మియాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి అతిథిగా ఎస్సీ సెల్ జిల్లాఅధ్యక్షులు పందిటి కామరాజు హాజరవుతారని కావున ఎస్సీ సెల్ నాయకులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## కావలి ఒకటో పట్టణ పోలీసుల అదుపులో సైబర్ క్రైమ్ నిందితులా.?

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అకౌంట్‌లో ఇటీవల 25 లక్షల రూపాయలు సైబర్ క్రైమ్ జరిగినట్లు సమాచారం. ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు జార్ఖండ్‌లో సుమారుగా 7 రోజులు శ్రమించి కావలి ఒకటో పట్టణ సీఐ ఫిరోజ్ ఆధ్వర్యంలో వారిని అదుపు లోకి తీసుకున్నట్లు సమాచారం. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## ఆన్‌లైన్ ఇళ్ల స్థలాల అర్జీలపై తహసిల్దారు సమావేశం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ఆన్‌లైన్ ద్వారా ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న జాబితాపై మంగళవారం తాసిల్దార్ స్వప్న సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామ రెవెన్యూ అధికారుల సమక్షంలో జాబితాను పరిశీలించారు. 297 మంది ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకునే ఉన్నారని వీరిలో ఎంతమంది అర్హత కలిగి ఉంటారని విషయంపై గ్రామ రెవెన్యూ అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. తుది జాబితాను జిల్లా కలెక్టర్‌కు పంపుతామని తహసిల్దారు పేర్కొన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన చిత్రలేఖనం పోటీలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల లో భాగంగా మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన చిత్రలేఖనం క్విజ్ పోటీలను నిర్వహించారు. గ్రంథాలయాధికారి జ్యోతి కొండయ్య ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు పోటీ పరీక్షల పట్ల ఆసక్తిని కలిగించేలా తద్వారా వారిలోనే ప్రతిభను బయటకు తీయవచ్చు అని ఆయన తెలిపారు. విద్యార్థుల్లో అంతర్గతంగా ఉన్న ప్రతిభను ఈ పోటీ పరీక్షలు ద్వారా బయటకు తీయవచ్చు అన్నారు. అలాగే చిత్రలేఖను క్విజ్ పోటీలను నిర్వహించినట్లు ఆయన తెలిపారు భవిష్యత్తులో పోటీ పరీక్షలు అంటే భయాన్ని పోగొట్టి వారిలో ధైర్యాన్ని నింపే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉన్నారు.

## కుష్టు వ్యాధి అనుమానితుల..

## గుర్తింపు సర్వేను బాధ్యతగా చేయాలి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న కుష్టు వ్యాధి అనుమానితుల గుర్తింపు సర్వేను వైద్య ఆరోగ్య సిబ్బంది బాధ్యతగా నిర్వహించాలని మండల వైద్యాధికారిని శివ కల్పనపేర్కొన్నారు. ఆమె మంగళవారం మండలంలో జరుగుతున్న సరియైన పరిశీలించి సిబ్బందికి సూచనలు సలహాలు అందించారు. సిబ్బంది ప్రతి ఇంటికి తిరిగి శరీరంపై స్పెషల్ ఏమి, రాగి మచ్చలు, పొడలనుగుర్తించి నమోదు చేయాలన్నారు. ఈనెల చివరి నాటికి సర్వేను పూర్తి చేసి కేటాయించిన లక్ష్యాలను నూరు శాతం పూర్తి చేయాలన్నారు. సర్వే చేసిన ప్రతి ఇంటికి క్రమ సంఖ్యను కేటాయించాలన్నారు. కుష్టు వ్యాధి రహితసమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూకృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే సోమిరెడ్డి రాక !



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** రైతులకు అండగా ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల నిధుల విడుదల కార్యక్రమం బుధవారం మధ్యాహ్నం ఘనంగా జరగనుంది. ఈ కార్యక్రమానికి సర్వేపల్లి నియోజకవర్గ గౌరవ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హాజరవుతారు. మండల పరిషత్ కార్యాలయంలో రైతుల సంక్షేమార్థం అన్నదాత సుఖీభవ రెండవ విడత రూ.5వేలు, అలాగే పీఎం కిసాన్ 21వ విడత రూ.2వేలు నిధులను అర్హత గల రైతులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేయనున్నట్టు అధికార వర్గాలు తెలియజేశాయి. ఈ కార్యక్రమానికి అన్ని మండల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యలు, సాగు అవసరాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే సమీక్షించనున్నట్టు సమాచారం.

# అయ్యప్ప స్వామి నూతన పంచలోహ విగ్రహానికి సంప్రోక్షణ పూజ



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి మండలం గంగిరెడ్డిపల్లి గ్రామంలో మన ఫౌండేషన్ వ్యవస్థాపకులు, తెలుగుదేశ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి మంగళవారం అయ్యప్ప సేవ సమాజానికి నూతన పంచలోహ విగ్రహానికి సంప్రోక్షణ గణపతి పూజ పుణ్య అవాచక కంకణ దారుణం అభిషేకం కళాస్థాపన హెూమం పూర్ణాహుతి సంప్రోక్షణ నివేదన నిరంజన కార్యక్రమాలు వేద పండితులు, అయ్యప్ప గురు స్వాములు, అయ్యప్పలు అందరూ కలిసి అయ్యప్ప శరణాలతో ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున వచ్చి పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నప్రసాదాలు పంచామృతాలు భక్తులకు అందించడం జరిగింది. వేద పండితులు మన్నేటి దంపతులను ఆశీర్వదిస్తూ అష్టైశ్వర్యాలు ఆయువు ఆరోగ్యాలతో నూరేళ్లు సంతోషంగా ఉండాలని దీవించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మన ఫౌండేషన్ సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది. అనంతరం శ్రీ హరి హర సుతుడు శ్రీ అయ్యప్ప స్వామిని పల్లకిలో మంగళ వాయిద్యాల అయ్యప్ప స్వాముల శరణు ఘోషతో బాణాసంచతో కోలాట భజనలతో ఊరేగింపుగా ఉదయగిరిలోని శివాలయంకు మన్నేటి శ్రీలక్ష్మి వెంకటరెడ్డి దంపతులు ఉదయగిరి శివాలయం చేరుకుని అనంతరం అయ్యప్ప సమాజానికి నూతన పంచలోహ విగ్రహాన్న అందించడం జరిగింది.

# అభ్యాసన, పఠన సామద్యాలు పరిశీలించిన విద్యా శాఖ అధికారులు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** విద్యార్థుల అభ్యాసన పఠన సామధ్యాలను మండల విద్యా శాఖధికారులు పరిశీలించారు. మంగళవారం ఎంఈఓ-1 పట్టణంలోని డిపేప్ పాఠశాలను ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల శకునాలపల్లి పాఠశాలను తనిఖీ చేశారు. సందర్భంగా ఆయన విద్యార్థుల అభ్యసన, పఠన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల యొక్క హెూలిస్టిక్ కార్డ్స్, అసెస్మెంట్ బుక్లెట్స్‌ను పరిశీలిస్తూ హెూలిస్టిక్ కార్డ్స్, అసెస్మెంట్ బుక్ లెట్స్ ఎప్పటికప్పుడు అప్డేటెడ్‌గా ఉండాలని తెలియజేశారు. పరీక్షల అనంతరం అస్సెస్మెంట్ బుక్ లెట్స్‌ను కరెక్షన్ చేసి ఎప్పటికప్పుడు హెూలిస్టిక్ కార్డ్స్ నందు నమోదు చేయాలని తెలియ జేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజనాన్ని పరిశీలిస్తూ ప్రతిరోజు మెనూ ప్రకారం విద్యార్థులను తమ సొంత బిడ్డలుగా భావించి ప్రతిరోజు రుచిశుచి కరంగా భోజనం తయారు చేయవలెనని నిర్వాహకులకు తెలియజేశారు. మధ్యాహ్న భోజనం పరిశీలించగా రుచికరంగా ఉండడంతో నిర్వాహకురాలు ఎన్.మమతని అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.పెంచల నరసింహులు పాల్గొన్నారు.

## రాజరాజేశ్వరి దేవి సన్నిధిలో కాత్యాయని వ్రతం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు దుర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు మంగళవారం శ్రీ అమ్మవారికి అనివెట్టి మండపం నందు ప్రత్యేకంగా ప్రత్యేక పూలతో అలంకారం చేసి కాత్యాయని వ్రతం చేయుట జరిగింది. ఈ వ్రతం చేయుట వలన వధూవరులకు జాతక రీత్యా కుజదోషం, కాల సర్పదోషాలు అన్ని తొలగిపోయి ఉత్తమమైన వివాహం జరగును. స్త్రీలు సౌభాగ్యం కొరకు, ఆయురారోగ్యాల కొరకు, అన్యోన్య దాంపత్యం కొరకు ఈ కాత్యాయని వ్రతంను చేయవచ్చునని ఆలయ అర్చకులు తెలిపారు. ఈ వ్రతంను ఆచరించిన యెడల ఉత్తమమైన ఫలితాలు లభించును. పై కార్యక్రమాలన్నీ ఆలయ సహాయ కమీషనరు, కార్యనిర్వహణాధికారి పర్యవేక్షణలో జరిగాయి. కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## స్వామిత్వ నోటీసులు సిద్ధం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం పరిధిలో అమలు చేయనున్న స్వామిత్వ పథకంకు సంబంధించి గృహ యజమానులకు నోటీసులు జారీ చేసే ప్రక్రియకు కృష్ణపట్నం పంచాయతీ అధికారులు శ్రీకారం చుట్టారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ సర్వే మరియు సరిహద్దులు చట్టం ప్రకారం నోటీసులు తయారు చేశారు. త్వరలోనే సర్వే చేసిన ప్రతి లబ్ధిదారుడికి నోటీసులు ఇచ్చి అభ్యంతరాలు తీసుకొని ప్రాపర్టీ సర్టిఫికెట్లు ఇవ్వడం జరుగుతుందని పంచాయతీ అధికారులు పేర్కొన్నారు.

### అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని

## విజయవంతం చేయండి



**రాపూరు, మేజర్‌న్యూస్ :** వెంకటగిరి నియోజకవర్గంలోని కలవాయిలో బుధవారం జరిగే అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మండలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలి రావాలని రాపూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెన్ను అశోక్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుల ఖాతాలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నగదును జమ చేయనున్న నేపథ్యంలో స్థానిక శాసన సభ్యులు కురుగొండ్ల రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

## శ్రీ సుదర్శన నారసింహ హెూమం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మాగుంట లేఔట్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానం నందు కార్తీక మాసం సందర్భంగా భక్తులు మంగళవారం ఉదయం నుండి శ్రీవారి దర్శనం చేసుకున్నారు. స్వాతి నక్షత్రం సందర్భంగా మంగళవారం ఉదయం దేవస్థానం నందు శ్రీ సుదర్శన నారసింహ హెూమం నిర్వహించారు. కార్తీక మాసంలో శివుడు, శ్రీనివాసుడు ఇరువురికి ప్రీతికరం. భక్తులు భారీగా తరలివచ్చి ఉదయం నుండి కార్తీక దీపాలు వెలిగించి శ్రీవారిని స్మరించుకున్నారు. అనంతరం రాత్రి శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించి శ్రీవారిని దర్శించి తరించారు. ఆలయం వారు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసి వారికి తీర్థప్రసాదాలు అందించారు.



## సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించిన జడ్పీటీసీ



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశాన్ని వైసీపీ జడ్పీటీసీ జంపాని రాఘవులు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించారు. అనంతరం జడ్పీటీసీ జంపాని రాఘవులు మాట్లాడుతూ.. కావలి మండలంలో రైతులకు సరైన సమయంలో యూరియాకి సంబంధించిన కార్డులు రైతు భరోసా కేంద్రంలో అందరికీ అందుబాటులోకి సరైన క్రమంలో న్యాయపరంగా ఇవ్వకపోవడంపై, గత 2024 సంవత్సరం నుండి ఇప్పటివరకు మండల గ్రాంటు, నిధులు ఎంపీటీసీ సభ్యులకు అభివృద్ధి పనుల కొరకు గ్రాంట్ మంజూరు చేయకపోవడంపై తదితర కారణాల దృష్ట్యా ఈ సర్వసభ్య సమావేశాన్ని జడ్పీటీసీ జంపాని రాఘవులు బహిష్కరిస్తున్నట్లు వారు తెలిపారు.

## విద్యార్థులకు రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాల రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో 400 మంది విద్యార్థులకు రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల కరస్పాండెంట్ కే.కోటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. సాటి మనిషి ప్రాణాలను కాపాడడం కంటే పవిత్రమైన కార్యం మరొకటి లేదని వారు తెలిపారు. ఎక్కడ ప్రాణాపాయం ఉంటుందో అక్కడ రెడ్ క్రాస్ ప్రాణాలు కాపాడేందుకు ముందు ఉంటారని తెలిపారు. కేవలం రక్త సహాయమే కాకుండా ప్రాథమిక చికిత్స విపత్తు నిర్వహణలో శిక్షణ ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్ కిరణ్ కుమార్, కావలి రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు, జూనియర్ రెడ్ క్రాస్ బెజవాడ ప్రసన్నకుమార్, జూనియర్ రెడ్ క్రాస్ కళాశాల కన్వీనర్ పి.సాయికుమార్, జూనియర్ రెక్కాస్ పాఠశాలల కన్వీనర్ జి.హరినాథ్, రెడ్ క్రాస్ రక్త కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ : ఎమ్మెల్యే కావ్య



**కావలి, మేజర్‌న్యూస్ :** వివిధ వ్యాధులపై చికిత్స పొంది ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కావలి నియోజకవర్గం లోని 750 మందికి ఇప్పటివరకు ఆరు కోట్ల 58 లక్షల 26,580 రెండు కోట్లు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశామని కావలి ఎమ్మెల్యే కావ్య తెలిపారు. టీడీపీ కార్యాలయంలో 41 మంది లబ్ధిదారులకు 27 లక్షల 28,936 చెక్కులు అందజేసినట్టు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కావ్య మాట్లాడుతూ, రాష్ట్రంలోని సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీలో కావలి ప్రథమంగా ఉందన్నారు. వైద్యానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెద్దపెట్ట వేసింది అన్నారు. మిగతా ఎవరికైనా సీఎం రిలీఫ్ రావాల్సి వస్తే త్వరలోనే అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఏకతాటిపై ఈదూరు గ్రామ అభివృద్ధి : బాబునాయుడు

**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని ఈదూరు గ్రామ అభివృద్ధే తమ లక్ష్యమని, రాజకీయాలు పక్కన పెట్టి గ్రామ ప్రగతి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలనే అభిప్రాయాన్ని కోడూరు నీటి సంఘం అధ్యక్షులు రాపర్ల మల్లికార్జున ప్రసాద్ చౌదరి (బాబు నాయుడు) వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి ప్రత్యేక సహకారంతో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు. స్కూల్స్ అభివృద్ధి, పశువుల వైద్యశాల, త్రాగునీటి సదుపాయం, గ్రంథాలయం, హరిజనవాడ అభివృద్ధి, కొంత మేర సీసీ రోడ్ల నిర్మాణం వంటి పనులు గ్రామ ప్రజలకు మంచి ఉపయోగం చేకూర్చాయని తెలిపారు. కొత్తగా ప్రభుత్వం ఏర్పడిన తరువాత కూడా కేవలం 16 నెలల్లోనే ఈదూరుమండపం లింక్ రోడ్డుకు శంకుస్థాపన, సోలార్ లైట్ల ఏర్పాటు, సచివాలయ ప్రారంభోత్సవం గ్రామంలోని ఆటో కార్మికుల సంక్షేమ భరోసా కోసం కృషి, 24 గంటల విద్యుత్ సరఫరా వంటి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని, ఇప్పటివరకు సుమారు నాలుగు కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి



పనులు అమలు చేసినట్టు వివరించారు. గ్రామ భవిష్యత్తు కోసం పార్టీ భేదాలు పక్కనపెట్టి అందరూ కలిసి పనిచేయడం వల్లే ఈ అభివృద్ధి సాధ్యమైందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం యువ నేతలు అనిల్ చౌదరి, వట్టిగుంట రమణయ్య నాయుడు, రవినాయుడు, శ్రీనివాసులురెడ్డి, సుదీర్ తదితరులు కూడా గ్రామ అభివృద్ధికి శాసనసభ్యుడు సోమిరెడ్డి అందిస్తున్న సహకారాన్ని ప్రశంసిస్తూ, రాబోయే రోజుల్లో ఈదూరును మరింత అభివృద్ధి పథంలో నడిపేందుకు తమదైన పాత్ర పోషిస్తామని తెలిపారు. 'గ్రామ ప్రగతి రాజకీయాలకు అతీతం. అభివృద్ధి కోసం ఎప్పుడూ ముందుంటాం' అని నాయకులు ఏక స్వరంతో వెల్లడించారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు





**రాపూరు, మేజర్‌న్యూస్ :** రాపూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం బీఏ, బీ.కాం కంప్యూటర్ అప్లికేషన్స్ తదితర కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు జరుగుచున్నవని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హనుమంతయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజనీరింగ్ కాలేజీలలో సీటు రానటువంటి వాళ్ళు, నీట్ పరీక్షలలో విజయం సాధించలేని వారు, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఖాళీగా ఉన్నవారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ విజ్ఞప్తి చేశారు. స్పాట్ అడ్మిషన్లకు ఈనెల 20వ తేదీ లోపు విద్యార్థిని విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. స్పాట్ అడ్మిషన్ కొరకు వచ్చే విద్యార్థిని విద్యార్థులు తప్పనిసరిగా తమ వెంట ఇంటర్మీడియట్ మార్క్స్ మెమో, క్యాస్ట్ సర్టిఫికెట్, ఆధార్ సర్టిఫికెట్, బదలి సర్టిఫికేట్ తీసుకొని రావాలని ప్రిన్సిపాల్ సూచించారు. ఈ అవకాశాన్ని స్థానిక విద్యార్థినీ విద్యార్థులు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. కాలేజీ పని వేళలైన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటలలోపు ఏ సమయంలోనైనా డిగ్రీ ప్రథమ సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్ కొరకు సంప్రదించవచ్చని ప్రిన్సిపల్ డాక్టర్ హనుమంతయ్య పేర్కొన్నారు.

# పెంచలకోన క్షేత్రంలో శాంతి హోమం



**రాపూరు, మేజర్‌న్యూస్ :** రాపూరు మండలంలోని పెంచలకోన క్షేత్రంలో మంగళవారం శ్రీవార్ల జన్మ నక్షత్రం(స్వాతి నక్షత్రం) సందర్భంగా ఉదయం 4 గంటలకు శ్రీస్వామి వారికి అభిషేకం, చందనాలంకారం, 9 గంటలకు శాంతిహోమం, మధ్యాహ్నం 12 గంటలకు శ్రీవార్లకు కళ్యాణోత్సవం, సాయంత్రం 5.30 గంటలకు బంగారుగరుడ వాహనసేవ తదితర ప్రత్యేక పూజ కార్యక్రమాలు ప్రధానార్చకులు, వేదపండితుల మంత్రోచ్ఛరణలతో మంగళవాయిద్యాల నడుమ అత్యంత వైభవంగా కన్నుల పండువగా నిర్వహించడం జరిగిందని దేవస్థానం ఉప కమీషనర్ అండ్ కార్యనిర్వహణాధికారి పొరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వామి వారి పూజ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్ల ఏర్పాట్లు, మంచినీరు సరఫరా, అన్నదానం తదితర కార్యక్రమాలను ఉప కమిషనర్ కార్యనిర్వహణాధికారి పర్యవేక్షించారు.

# కార్తీక మాస అన్నదానం సకల పుణ్య ప్రాప్తం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** కార్తీకమాసంలో అన్నదానం చేసినట్లయితే సకల పుణ్యాలు ప్రాప్తిస్తాయని భక్తులు విశ్వసిస్తారు. అందులో భాగంగానే కార్తీక మాసం పురస్కరించుకుని వింజమూరులోని గాయత్రీ నగర్ నందలి వేద గాయత్రి అయ్యప్ప స్వామి సన్నిధిలో అన్నదాన కార్యక్రమాన్ని వింజమూరు మండల వైసీపీ కన్వీనర్ రేవునూరి శ్రీనివాసులురెడ్డి, అనూష దంపతులు కుమారుడు కాస్యపురెడ్డి కుమార్తె తాహిత్య ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్తీక మాసం శుభ మాసమని ఈ మాసంలో అన్నదాన కార్యక్రమం పరమ పుణ్య కార్యక్రమంగా ఉంటుందని ఈ ఆలోచనతో ఈ చిరు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ముందుగా హరిహరపుత్ర అయ్యప్ప స్వామికి అభిషేకాలు జరిపించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గోవిందస్వామి భక్తులు భవాని మాలధారులు శివమాలదారులు అయ్యప్ప మాలధారులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి గణపం రమేష్ రెడ్డి ఎం.వీరారెడ్డి చీమల హాజరత్ రెడ్డి గువ్వల కృష్ణారెడ్డి లెక్కల సుధాకర్ రెడ్డి వెంకటేష్ శివారెడ్డి అనిమిరెడ్డి భక్తులు తదితరులు ఉన్నారు.

# గ్రంథాలయ వారోత్సవాల్లో పుస్తక ప్రదర్శన



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారం లైబ్రేరియన్ ఓ.శ్రీనివాసరాజు, స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల నందు నిర్వహించారు. అనంతరం పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో బాల సాహిత్యం, జనరల్ నాలెడ్జ్, జనరల్ సైన్స్, వ్యక్తిత్వ వికాస గ్రంథాలు, జీవిత చరిత్ర, పుస్తకలు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు రుక్మిణి, పిల్లలచే సామూహిక పుస్తక పఠనం చేయించారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయంలో సభ్యత్వాన్ని స్వీకరించి పుస్తకాలను వినియోగించుకోవాలని లైబ్రేరియన్ కోరారు. అనంతరం విద్యార్థులచే గ్రంథాలయ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, నాణేల సేకరణ కర్త ఎండి వాయిాజ్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# పురుషుల క్రీడా పోటీలు ముగింపు

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో విక్రమ సింహపురి యూనివర్సిటీ పురుషుల క్రీడా పోటీలు జవహర్ భారతి కళాశాల నందు నవంబర్ 17, 18 తేదీల్లో నిర్వహించారు. అనంతరం గెలిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఫలితాలు బాస్కెట్బాల్ జవహర్ భారతి కళాశాల విన్నర్స్, రన్నర్స్ యూనివర్సిటీ కాలేజీ నెల్లూరు అలాగే జవహర్ భారతి విన్నర్స్, వీఎస్‌యు కాలేజీ రన్నర్స్ టెన్నిస్ డబుల్స్ విన్నర్స్ జోహార్ భారతి, రన్నర్స్ ఎంఎస్ఆర్ కాలేజ్ షటిల్ బ్యాట్మెంటన్ సింగిల్స్ విన్నర్స్ జెవి, రన్నర్స్ కృష్ణ చైతన్య నెల్లూరు, షటిల్ బ్యాట్మెంటన్ డబుల్ విన్నర్స్ జోహార్ భారతి, రన్నర్స్ కృష్ణ చైతన్య నెల్లూరు, ఫుట్బాల్ విన్నర్స్ కృష్ణ చైతన్య నెల్లూరు, రన్నర్స్ కావలి జవహర్ భారతి వాలీబాల్ విన్నర్స్ జెన్ఎక్స్, నెల్లూరు భారతి, టోర్నమెంట్లో జవహర్ భారతికళాశాల 60పాయింట్లు సాధించి ముందంజలో ఉంది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్రమణ్యం నాయుడు,




స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ వెంకట్రాయిలు, అబ్జర్వర్ రవీంద్ర బాబు, పులివర్తి భాస్కరరావు, మణికంఠ, బ్రహ్మయ్య, శ్రీను తిరుపాలు, శివయ్య హమ్ రాజ్, ఫిజికల్ డైరెక్టర్లు అందరూ ఈ టోర్నమెంట్ను విజయవంతంగా నిర్వహించారని, నిర్వహణ అధికారి కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ప్రసాద్ రెడ్డి తెలిపి, వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# సమస్యలపరిష్కారమే తమ ప్రభుత్వ తొలిప్రాధాన్యత

## ప్రజావిజ్ఞప్తులు స్వీకరించిన మంత్రి ఆనం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్రజాసమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ తొలిప్రాధాన్యత అని రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆయన మంగళవారం తమ కార్యాలయంలో ప్రజావిజ్ఞప్తులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలనుండి వచ్చిన ప్రజలనుండి ఆయన వినతిపత్రాలను స్వీకరించి ఆ వివరాలను తెలుసుకొని వాటిగురించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈసందర్భంగా మంత్రి రామనారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రజాసమస్యల పరిష్కారంలో పారదర్శకత, బాధ్యతాయుతమైన పాలన తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజా అభ్యర్థనల పరిష్కార పద్ధతి తమ పరిపాలనకు మూల స్థంభమన్నారు. ప్రతి వినతిని అధికారులు గౌరవంగా బాధ్యతాయుతంగా తీసుకోవాలని, పరిష్కరించేలా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు నిజమైన లబ్ధిదారులకు ఆలస్యం లేకుండా చేరేలా కృషి చేస్తున్నట్లు మంత్రి ఆనం పేర్కొన్నారు. ప్రజల వ్యక్తపరిచిన ప్రతి సమస్యకు న్యాయం జరిగేవరకు తగిన చర్యలు తీసుకుంటామని రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నియోజకవర్గ నాయకుడు తాళ్ళూరు గిరినాయుడు, ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మెన్ ఆరికట్ల జనార్ధన్‌నాయుడు, మాజీ శాసనసభ్యులు కంచర్ల శ్రీహరినాయుడు, ఆత్మకూరు మండల తెలుగుదేశం అధ్యక్షుడు సుంకర పెంచలచౌదరి, పలువురు నాయకులు, వివిధ ప్రాంతాలనుండి వచ్చిన ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కులగణన చేపట్టాలి : సీపీఐ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** సామాజికన్యాయం, ఆత్మగౌరవం, దళిత, గిరిజన, మైనారిటీలపై దాడులను ఖండిస్తూ జనగణనలో కులగణన చేపట్టాలని సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి యామాల మధు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త నిరసనలోబాగంగా మంగళవారం ఆత్మకూరులో మధు ఆధ్వర్యంలో ర్యాలీ, ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్రమోడీ అధికారం చేపట్టిన తదుపరి 11ఏళ్ళ కాలంలో దళిత, గిరిజన, మైనారిటీలపై దాడులు మితిమీరిపోయాయన్నారు. దేశంలో మతోన్మాదపాలన సాగుతుందన్నారు. అణచివేత, అంటరానితనం, కులమత వివక్షత, హింస పెట్రేగిపోతున్నాయని ఆయన విమర్శించారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్‌బ్యూరో 2023 నివేదిక ప్రకారం షెడ్యూల్ కులాలవారిపై జరిగిన నేరాలకు 57,789 కేసులు, షెడ్యూల్ తెగలపై జరిగిన నేరాలకు 12,960 కేసులు నమోదవగా మహిళలపై 4.48లక్షల కేసులు నమోదయ్యాయన్నారు. ఇటీవల భారత ప్రధానన్యాయమూర్తి బిఆర్‌గవాయ్‌మీద సనాతనవాది దాడికి పాల్పడిన ఘటన ఒక మచ్చుతునక అన్నారు. నరేంద్రమోడీ పాలనతో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రక్షణ ప్రశ్నార్థకమైందని ఆయన పేర్కొన్నారు. మన రాష్ట్రంలో 143 వెనుకబడిన కులాలు ఉన్నాయని, గత స్థానిక ఎన్నికల్లో బిసిలకు కేటాయించిన స్థానాలు తగ్గించి నందున వేలసంఖ్యలో బిసిలు పదవులను కోల్పోయారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణా ప్రభుత్వ జనాభాలెక్కల సేకరణ సందర్భంగా కులగణన చేపట్టి తదనుగుణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు స్థానిక సంస్థల్లో సీట్లు కేటాయిస్తే అసెంబ్లీలో రెండు బిల్లులు ఆమోదించారన్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా జనగణనలో కులగణన చేపట్టి కులాల ప్రాతిపదికన స్థానికసంస్థల్లో సీట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాప్రభుత్వాలుగా ప్రజాసంక్షేమం మేరకు పాలనసాగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి జంగం నాగరాజు, నాయకులు చెంచయ్య, నాగేంద్ర, వాసు, హరి, రమణయ్య పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు బానిస కావొద్దు : ఎస్పీ





**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** యువత మాదకద్రవ్యాలకు మత్తు పదార్థాలకు బానిస కావద్దని నేటి యువత వాటికి దూరంగా ఉండాలని, జిల్లా వ్యాప్తంగా ప్రజలకు మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల సూచించారు.వారి ఆదేశాల మేరకు జిల్లా అడిషనల్ ఎస్పీ సిహెచ్ సౌజన్య ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభయాన్ కార్యక్రమం ప్రారంభించి ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులు, డిపిఒ సిబ్బంది, వివిధ కళాశాల విద్యార్థులు చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ నషా ముక్త్ భారత్ అభియాన్ లక్ష్యాలను జిల్లాలో సాధించడానికి జిల్లా పోలీస్ శాఖ కట్టుబడి ఉందని అందరూ నిబద్ధతతో పనిచేయాలని ఆమె ఆదేశించారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావం నుండి ప్రజలను ముఖ్యంగా యువతను రక్షించడమే దీని ప్రధాన లక్ష్యమని అభియాన్ యొక్క విజయానికి ప్రజల సహకారమే కీలకమని, తద్వారా జిల్లాను మాదకద్రవ్యాల నుండి పూర్తిగా విముక్తి చేయడం సాధ్యమవుతుందని వివరించారు. జిల్లాను మాధవి ద్రవ్య ప్రభావం నుండి సంపూర్ణంగా విముక్తం చేయడానికి ప్రతిజ్ఞ చేస్తున్నామని, ఇందుకోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా మత్తు పదార్థాల వాడకంతో నూరేళ్ల జీవితాన్ని నాశనం చేసుకోవద్దని.. మాదకద్రవ్యాల వ్యసనానికి లోనైన వ్యక్తి జీవితం అంధకారంలోకి వెళ్తుందని ఆ వ్యక్తి మాత్రమే కాకుండా వారి కుటుంబ సభ్యుల జీవితాలు కూడా నాశనం అవుతాయని, ముఖ్యంగా కాలేజీలకు వెళ్తున్న విద్యార్థులపై తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని, ఆవారాగా తిరుగుతున్న పిల్లలను వారి తల్లిదండ్రులు ప్రతినిత్యం గమనించాలని కోరారు. డ్రగ్స్ వినియోగిస్తే ఆరు నెలల నుండి సంవత్సరం వరకు డ్రగ్స్‌ను కలిగి ఉన్న లేదా అమ్మిన 10 నుండి 20 సంవత్సరాలు, డ్రగ్స్ సంబంధిత నేరాలను ప్రోత్సహిస్తే 10 నుండి 20 సంవత్సరాల వరకు జైలు శిక్ష మరియు జరిమానా ఉంటుందని తెలియజేశారు. జిల్లాలో ఎటువంటి అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలు డ్రగ్స్ అమ్మిన వినియోగించే వారి గురించి డయల్ 112 లేదా ఈగల్ సెల్ 1972 లేదా ఎన్ ఎంబిపి-14446 టోల్ ఫ్రీ నెంబర్లకు ఎప్పుడైనా ఫిర్యాదు చేయవచ్చునని సమాచారం అందిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ తెలియజేశారు. అదేవిధంగా ప్రతిజ్ఞలో యువత తమ దేశాన్ని మాదిగ ద్రవ్యరహితంగా మార్చడంలో భాగస్వాములవుతామని తమ శక్తి మేరకు సహకరించేందుకు సిద్ధమని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి ఏఆర్ చంద్రమోహన్, ఏవో చంద్రమౌళి, ఆర్ఐ అడ్మిన్ శ్రీహరిబాబు, ఎస్‌బి టు సిఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ ఎస్టీ సెల్ సీఐ లక్ష్మణరావు, డిపిఒ అధికారులు, ఈగల బృందం, కళాశాల విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు మంత్రి ఆనం ఆత్మకూరులో పర్యటన



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర దేవాదాయశాఖామాత్యులు ఆనం రామ నారాయణరెడ్డి బుధవారం ఆత్మకూరులో పర్యటించనున్నారని ఆపార్టీ నాయకులు తెలిపారు. ఉదయం 10గంటలకు ఆత్మకూరు మినీబైపాస్ రోడ్డు పనులను మంత్రి పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం ఆ సమీపంలోనే ఉన్న క్రీడా వికాస కేంద్రాన్ని మంత్రి పరిశీలిస్తారని, అనంతరం స్థానిక రక్షిత మంచినీటి పథకం వాటర్‌ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను కూడా ఆనం పరిశీలిస్తారని వారు పేర్కొన్నారు. అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంత్రి రామనారాయణరెడ్డి ప్రజావిజ్ఞప్తులు స్వీకరిస్తారన్నారు. మధ్యాహ్నం 3గంటలకు నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై ఉన్న శ్రీధర్‌గార్డెన్స్ కళ్యాణమండపంలో అన్నదాతసుఖీభవ, ప్రధానమంత్రి కిసాన్‌పథకం ద్వారా నిధులు విడుదల చేసే కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని వారు పేర్కొన్నారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ హోదాల్లో ఉన్న ప్రతినిధులు, సోషల్‌మీడియా సిబ్బంది ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని వారు కోరారు.

### రైతుల తక్కువ గాఢత కలిగిన

## పురుగు మందులు వాడాలి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** రైతులు పంటల సాగు విషయంలో నాణ్యత కలిగిన విత్తన ఎంపిక, ఎరువుల వాడకంతో పాటు,తక్కువ గాఢత కలిగిన పురుగు మందులు వాడాలని మండల వ్యవసాయ అధికారి విజయభాస్కర్ సూచించారు. ఆయన మంగళవారం పట్టణంలోని బిట్2రైతు సేవా కేంద్రం, వెంగళరావు నగర్ సచివాలయ పరిధిలోని గండిపాలెం పంచాయతీ కార్యాలయంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి, మట్టి నమూనా పరీక్షలు, పంట మార్పిడి విధానాన్ని పాటించాలన్నారు. పంట తొల దశలో తక్కువ మోతాదులో నాణ్యమైన ఎరువులు పురుగు మందులు వాడాలన్నారు. వ్యవసాయ అధికారులు సూచించిన మందులనే వాడాలన్నారు. రైతులు పంట నమోదు చేయించుకోవాలన్నారు. దీనివల్ల ఎన్నో ఉపయోగాలు కలుగుతాయి అన్నారు.

### జలాశయ ఆయకట్టు కింద

## ముమ్మరంగా అభివృద్ధి పనులు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని గండిపాలెం పొన్నె బోయిన చెంచురామయ్య జలాశయ ఆయకట్టు పరిధిలో ముమ్మరంగాఅభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ పనులను ఈనెల చివరి నాటికి పూర్తి చేసేందుకు జల వనరుల శాఖ డీఈ కందుకూరి చంద్రమౌళి, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ అడుసు మల్లి. వెంకటసుబ్బయ్యలు పనులను పర్యవేక్షిస్తూ సాగునీటి సంఘాలకు సూచనలందిస్తున్నారు. కాలువల్లో పూడికతీత, కంప చెట్లు తొలగింపు, కాలువలపై ట్రాక్ కుఅడ్డుగా ఉన్న చెట్లు తొలగింపు, కట్ట ముందు భాగంలో జంగిల్ క్లియరెన్స్ తదితర పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.74 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో ఈ పనులు చేపడుతున్నారు. రైతులకు డిసెంబర్ 5న సాగునీటిని కాల్వల ద్వారా విడుదల చేసేందుకు చర్యలు తీసుకున్నారు. పనులను నిత్యం ఏఈలు సురేష్, వేణు ఐపరిశీలిస్తున్నారు.

## రోడ్లు,డ్రైన్లు ఆక్రమిస్తే చర్యలు : కమిషనర్

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ స్థానిక జనార్దన్ రెడ్డి కాలనీ ప్రాంతంలో జరుగుతున్న రోడ్డు ఆక్రమణల తొలగింపు పనులను మంగళవారం పర్యవేక్షించారు. టౌన్ ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో రోడ్డు మార్జిన్ మార్కింగ్, డ్రైన్ కాలువల మార్కింగ్ పనులను కమిషనర్ పరిశీలించి వివిధ సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాలు, కార్పొరేషన్ స్థలాలు, రోడ్లు డ్రైను కాలువలను ఆక్రమిస్తూ చేపట్టిన నిర్మాణాలను తప్పనిసరిగా కూల్చివేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ రామ్ మోహన్ రావు, ఈఈ రహంతు జానీ, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర రైతులకు కూటమి ప్రభుత్వం మరోసారి దగా

- పెట్టుబడి సాయంలో 7లక్షల మంది రైతులు కట్
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఫైర్
- 2024 జూన్ నుంచి సూపర్ సిక్స్ అన్న బాబు మాటలు బూటకం
- తొలి ఏడాదే రైతుల పెట్టుబడి సాయానికి ఎగనామం
- రెండో ఏడాది కూడా అదే తరహా మోసం. అరకొర సాయం
- జగన్ హయాంలో 53.58 లక్షల మందికి రైతుభరోసా
- వారి సంఖ్యను 46.85 లక్షలకే కుదించిన కూటమి ప్రభుత్వం
- ఇది పూర్తిగా రైతు ద్రోహి ప్రభుత్వం
- రైతులను తీవ్రంగా వేధిస్తున్న యూరియా కొరత
- రేషన్ కార్డు తరహాలో యూరియా కార్డులు
- రూ.150 అదనంగా బ్లాక్ మార్కెట్‌లో అమ్మకాలు
- సకాలంలో రైతులకు అవసరమైన యూరియా అందించాలి
- ప్రెస్‌మీట్‌లో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి డిమాండ్

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలను నమ్మించి మోసం చేయడం చంద్రబాబుకి వెన్నతో పెట్టిన విద్య అని.. ఎన్నికల వనెల్లూరు, మేజర్‌న్యూస్ : ల్సిన తర్వాత మోహం చాటేయడం బాబుకు అలవాటేనని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ధ్వజమెత్తారు. 2024 జూన్ నుంచి సూపర్ సిక్స్ పథకాలు అమలుచేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు.. తొలి ఏడాదే రైతుల పెట్టుబడి సాయానికి ఎగనామం పెట్టగా.. రెండో ఏడాది అరాకొర సాయంతో 7లక్షల మంది రైతులకు మొండి చేయి చూపించారని మండిపడ్డారు. నెల్లూరు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. వైయస్ జగన్ హయాంలో 53.58 లక్షల మందికి రైతుభరోసా అందితే.. వారి సంఖ్యను 46.85 లక్షలకే కుదించిన చంద్రబాబుది రైతు ద్రోహి ప్రభుత్వమని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్లాక్ మార్కెట్ లో రూ.150 వరకు అధిక ధరకు అమ్ముకుంటున్నా.. రైతులకు కనీసం యూరియా అందించలేని ప్రభుత్వ అసమర్థతను ఆక్షేపించారు. విత్తనం నుంచి విక్రయం వరకు అన్నదాతకు అండగా వైయస్.జగన్ ప్రభుత్వం నిలబడితే... రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడిందని తేల్చి చెప్పారు.

## రైతులంటే చిత్తశుద్ధి లేని ప్రభుత్వం :

చంద్రబాబు నాయుడికి రైతుల పట్ల చిత్తశుద్ధి శూన్యం. రైతులకు ఎన్నికల్లో హామీలిచ్చి వారితో ఓట్లేయించుకుని.. ఎన్నికల గడిచిన తర్వాత వారిని వదిలేయడం చంద్రబాబుకి అలవాటు. అందులో భాగంగానే 2014 ఎన్నికల్లో రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేశాడు. 2024 ఎన్నికల్లో అన్నదాత సుఖీభవ పేరుతో మోసం చేశాడు. వైయస్సార్సీపీ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక.. మాపై విమర్శలు చేయడం, వ్యక్తిగతంగా మా పైనా, పార్టీ కార్యాలయాల పైనా దాడులు చేయడం కూటమి ప్రభుత్వానికి అలవాటుగా మారింది. జూన్ 2024 నుంచి సూపర్ సిక్స్ అమలు చేస్తానన్న హామీ గుర్తుందా చంద్రబాబూ? అదే సమయంలో రైతుకి రూ.20 వేలు ఇస్తామన్నారు. దానికి కట్టుబడి ఉన్నారా? జూన్ 2024 నుంచి ఇస్తామన్న మాట మీద నిలబడ్డారా? లేదు మాట తప్పామని ఒప్పుకుంటున్నారా? చంద్రబాబు హామీలను మర్చిపోయిన నటిస్తున్నాడు, ఆయన మర్చిపోయిన మేం గుర్తు చేస్తూనే ఉంటాం, ప్రశ్నిస్తూనే ఉంటాం.

## రైతులకు నిలువునా మోసం :

వాస్తవానికి వైయస్ జగన్ ప్రభుత్వంలో ఆఖరి ఏడాది 53.58 లక్షల మంది రైతులకు రైతుభరోసా ఇచ్చారు. మీ ప్రభుత్వం వచ్చేనాటికి ఆ సంఖ్య పెరుగుతుందే తప్ప, తగ్గదు. కానీ మీరు తొలి ఏడాదే రూ.20వేలు కేంద్రప్రభుత్వంతో సంబంధం లేకుండా ఇస్తామని చెప్పారు. ఆ లెక్క ప్రకారం రూ.10,716 కోట్లు, రెండేళ్లకి రూ.21,432 కోట్ల రైతులకు మీరిచ్చిన హామీ ప్రకారమే జమ చేయాలి. కానీ తొలి ఏడాది ఇవ్వాల్సిన రూ.10,716 కోట్లకు గానూ ఒక్క రూపాయి రైతులకు జమ చేయలేదు. రెండో ఏడాదికి వచ్చేసరికి పెట్టుబడి సాయం అందించాల్సిన రైతుల సంఖ్య 53.58 లక్షల నుంచి 46.85 లక్షల మందికి కుదించారు. ఇవ్వాల్సిన సాయంలో కూడా కోత పెట్టి రూ.14 వేలు మేము ఇస్తాం, రూ.6 వేలు కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని చెప్పి.. తన వాటా రూ.6,300 కోట్లు అని లెక్కకట్టి.. అందులో గతంలో రూ.2,300 కోట్లు ఇచ్చారు, రేపు చంద్రబాబు మరో రూ.2,300 కోట్లు ఇస్తామని ప్రకటించారు. అంటే రైతులకి ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ. 21,432 కోట్లకు గానూ రేపు జమ చేయబోయే మొత్తంతో కలుపుకుంటే కేవలం రూ.4,600 మాత్రమే రైతులకు ఇచ్చినట్లు లెక్క. అంటే రైతులను ఎంత దారుణంగా మోసం చేశారో తెలుస్తుంది. వైయస్.జగన్ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో రూ.34,288 కోట్లు పెట్టుబడి సాయం కింది అందిస్తే.. ఇవాళ కూటమి ప్రభుత్వం దాదాపు 7లక్షల మంది రైతులకు కోత విధించడంతో పాటు, ప్రతి రైతుకు రూ.20 వేలు ఇస్తామని ప్రకటించి కేవలం రూ.14 వేలు మాత్రమే ఇవ్వడం ఒక ఎత్తైతే... అందులో కూడా ఒక ఏడాది రైతులకు పెట్టుబడి సాయాన్ని ఎగరగొట్టడం మరింత దుర్మార్గం.



## కౌలు రైతుల గురించి నోరు మెదపని పవన్ కళ్యాణ్ :

చంద్రబాబు ప్రభుత్వం కౌలు రైతులకు రెండేళ్లు కూడా మొండిచేయి చూపించింది. ఆరోజు వైయస్సార్సీపీ ప్రభుత్వంలో కౌలు రైతులకు అన్యాయం జరుగుతుందని మొసలి కన్నీరు కార్చి, వారిని పరామర్శించిన పవన్‌కళ్యాణ్ ఇవాళ కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంటూ ఉపముఖ్యమంత్రిగా ఉంటూ కూడా కౌలురైతులను చంద్రబాబు మోసం చేస్తుంటే పవన్ కళ్యాణ్ ఎందుకు మాట్లాడ్డం లేదు? కచ్చితంగా వారికి పవన్ కళ్యాణ్ సమాధానం చెప్పాలి?.

అన్నదాత సుఖీభవలో ఆంక్షల పేరుతో కోత :

మరోవైపు రైతులు వారికి సంబంధించిన భూముల వివరాలు వెబ్‌ల్యాండ్‌లో నమోదైన రైతులకు మాత్రమే పెట్టుబడి సాయం చేస్తున్న ప్రభుత్వం.. వెబ్ ల్యాండ్‌లో భూముల వివరాలు నమోదు కాని వారికి పెట్టుబడి సాయాన్ని అందించడం లేదు. వాస్తవానికి వైయస్ జగన్ ప్రభుత్వ హయాంలో ఈ నాన్ వెబ్ ల్యాండ్ రైతుల వివరాలను కూడా నమోదు చేసుకుని వారికి కూడా రైతు భరోసా అందించారు. ఎవరైనా రైతు చనిపోతే.. ఆ కుటుంబంలో ఉన్న వారసుడి కోసం ప్రత్యేకంగా మాడ్యూల్ రూపొందించి ఫ్యామిలీ సర్టిఫికేట్ ప్రకారం వారసుల్లో ఒకరికి రైతు భరోసా సాయం అందించాం. ఇవాళ ఈ సాఫ్ట్‌వేర్ ను కూడా కూటమి ప్రభుత్వం లేకుండా చేసింది. రీసర్వే పేరుతో వెబ్‌ల్యాండ్‌ను హైడ్ చేస్తున్నారు. రైతులకు సంబంధించి రీ సర్వే జరుగుతున్న భూముల్లో ఫైనల్ నోటిఫికేషన్ అయి, ఆర్వో అయినంతవరకు ఆ రైతులకు అన్నదాత సుఖీభవ రాదు. ఇక డీకేటీ, ప్రభుత్వ భూములని 6వ కాలంలో ఉంటే వారికి కూడా పెట్టుబడి సాయం అందడం లేదు. ఇలా రకరకాలుగా నిబంధనలు పెట్టి లక్షల సంఖ్యల్లో అన్నదాత సుఖీభవ పథకానికి ఎగనామం పెట్టారు. దానికి సంబంధించి గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేసుకుంటే దానికి కూడా అతీ, గతీ లేదు. వైయస్.జగన్ హయాంలో వారంరోజుల్లో గ్రీవెన్స్‌కి వెళ్లి రైతుభరోసా రాలేదంటే దాన్ని పరిష్కరించే పరిస్థితి ఉండేది. కానీ కూటమి ప్రభుత్వంలో రేపు పెట్టుబడి సాయం రైతుల అకౌంట్లలో జమ చేస్తామని చెప్పినా.. ఆ జాబితాలో లేని రైతులు తమ గ్రీవెన్స్ని ఎవరికి చెప్పుకోవాలో తెలియని దుస్థితి. అంటే కేవలం మొక్కుబడి వ్యవహారం తప్ప... నిజంగా రైతులకు మేలుచేయాలన్న ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు. కేవలం ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే 7లక్షల మంది రైతులు ఈ పథకానికి దూరమయ్యారు. చివరకు ప్రభుత్వం ప్రకటించిన 46.85 లక్షల మందికైనా సక్రమంగా జమ చేసిందా అంటే అది కూడా లేని పరిస్థితి... జాబితాలో తమ పేర్లు ఉన్నా డబ్బులు అకౌంట్ లో జమ కాలేదని రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న దుస్థితి.

## రైతులను పూర్తిగా గాలికొదిలిన కూటమి ప్రభుత్వం :

మీ అధికారి పత్రికలోనే యూరియా కొరత వెంటాడుతుందని ప్రధాన శీర్షికలో వార్తలు రాశారు. బ్లాక్ మార్కెట్‌లో రూ.150 అదనంగా అమ్ముతున్నారు. ప్రశ్నిస్తే నో స్టాక్ బోర్డులు పెడుతున్నారని రాస్తే.. ఈ ప్రభుత్వం దగ్గర సమాధానం లేదు. నెల్లూరు జిల్లాలో తీవ్రంగా యూరియా కొరత వేధిస్తుంది. ఇటీవల మీరు నిర్వహించిన ఓ సమావేశంలో 7.50 లక్షల ఎకరాలకు నీళ్లిస్తామని ప్రకటించారు. దానికి సంబంధించి ఎంత మేర యూరియా అందుబాటులో ఉండాలి. డీఏపీ లాంటి దుక్కుపిండి ఎంత అందుబాటులో ఉండాలన్నది కనీసం లెక్కలు వేసుకోలేదు. ఫలితంగా రూ.270 అమ్మాల్సిన యూరియా బస్తా రూ.420–రూ.450 అమ్ముతుంది. రైతు నిలువుదోపిడీకి గురవుతుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేదు. పైగా అంతా సవ్యంగా జరుగుతుందని సిగ్గుమాలిన చంద్రబాబు ప్రభుత్వం ప్రకటనలివ్వడం దారుణం. సక్రమంగా రైతులకు యూరియా ఇవ్వలేక రేషన్ కార్డుల తరహాలో ఎకరాకు 3 బస్తాలిస్తామని.. యూరియా కార్డులిస్తున్న దిక్కుమాలిన ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం మాత్రమే. వైయస్.జగన్ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎంత కావాలంటే అంత యూరియా సరఫరా చేశాం. కారణం వైయస్.జగన్ ప్రభుత్వానికి రైతులంటే చిత్తశుద్ధి ఉంది, వారి సంక్షేమం కోసం పని చేయబట్టే యూరియా కొరత లేదు.

## రైతుకు అండగా వైయస్సార్సీపీ ప్రభుత్వం :

రైతులకంటే చంద్రబాబుకు ఏమాత్రం చిత్తశుద్ధి లేదు. జగన్‌గారి హయాంలో ఉచిత పంటలబీమా ఉంటే దానికి చంద్రబాబు మంగళం పాడాడు. ఈ-క్రాప్ రద్దు చేశాడు. రైతుకు పెట్టుబడి సాయం కింద ఇచ్చే రైతు భరోసాకు అన్నదాత సుఖీభవ అని పేరు మార్చి.. పథకాన్ని కూడా కుదించాడు. విత్తనం నుంచి విక్రయం వరకు రైతుకు అండగా ఉండే రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేశాడు. అగ్రిటెస్టింగ్ ల్యాబ్ లకూ మంగళం పాడాడు. అరటి రైతుల ధర లేక ఆక్రందనలో ఉన్నారు. గతంలో అరటి కేజీ రూ.20–25 ఉంటే ఈ ప్రభుత్వంలో కేవలం రూ.6 నుంచి రూ.7కు అమ్ముడుపోతుంది. దాన్ని నోటిఫైడ్ క్రాప్ కాకపోయినా వైయస్ జగన్ గిట్టుబాటు ధర కల్పిస్తే.. ఇవాళ చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసింది. మొన్న మొంథా తుపానుతో సగం నష్టపోతే.. ఇవాళ గిట్టుబాటు ధర లేక మిగిలినది కూడా నష్టపోయే పరిస్థితి ఉన్నా వ్యవసాయశాఖ మంత్రి, ప్రభుత్వానికి కనీస స్పందన లేదు.

## మా హయాంలో నోటిఫైడ్ కాని పంటలకూ సాయం :

నోటిఫైడ్ క్రాఫ్ కానివాటికి కూడా వైయస్.జగన్ హయాంలో సీఎం యాప్ (కాంప్రెహెన్సివ్ మోనిటరింగ్ ఆఫ్ అగ్రికల్చర్ ప్రైస్ అండ్ ప్రొక్యూర్ మెంట్) పెట్టి.. రైతుల ఉత్పత్తుల రేటుపై నిరంతరం మానిటరింగ్ చేశాం. మార్కెట్‌లో రైతుల ఉత్పత్తులకు ధర ఎలా ఉంది, ఒకవేళ రైతు నష్టపోయే విధంగా ఉంటే.. ప్రభుత్వం జోక్యం చేసుకుని వారికి ధర కల్పించడానికి ఏకంగా రూ.3వేల కోట్లతో ధరలస్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి రైతులను ఆదుకున్నాం. రైతు పంటలు వేసిన వెంటనే ఈ-క్రాప్ ద్వారా ఉచిత పంటల బీమా రైతులు ఒక్క రూపాయి చెల్లించాల్సిన అవసరం లేకుండానే 75 లక్షల ఎకరాలకు సంబంధించి 85 లక్షల రైతు కుటుంబాలకు అందించాం. ఐదేళ్లలో రూ.7800 కోట్లు రూపాయులు, ఒకే ఏడాదిలో రూ.2987 కోట్లు పరిహారం రైతులకు చెల్లించి వారిని అదుకున్న ఘతన వైయస్.జగన్‌దే. ఏ సీజన్‌లో రైతులు పంట నష్టపోతే అదే సీజన్ ముగిసేలోగా వారికి ఇన్ పుట్ సబ్సిడీ చెల్లించాం. ఇవాళ చంద్రబాబు ప్రభుత్వంలో పంటల బీమా చేసుకున్న రైతుల సంఖ్య కేవలం 19 లక్షలు మాత్రమే. ఈ-క్రాప్‌లో నమోదైన రైతులకు మాత్రమే చంద్రబాబు ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ చెల్లించి.. ఉచిత పంటల బీమాకు మాత్రం మంగళం పాడిందని, రైతుల సంక్షేమం పట్ల ఈ ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆక్షేపించారు.

### కోడూరు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు

# పద్మనాభరావు మృతి



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని కోడూరు మండల పరిషత్ పాఠశాలలో సుదీర్ఘకాలం ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన పమిడిపాటి పద్మనాభరావు (93) మంగళవారం నెల్లూరులోని ఆయన స్వగృహం లో మృతి చెందారు. భార్య ముగ్గురు కుమార్తెలు మనుమలు మనమరాండ్రు ఉన్నారు. ఆయన పెద్ద అయ్యవారుగా గుర్తింపు తెచ్చుకున్నారు. మనుబోలు, వెంకటగిరి కోడూరు కొత్తకోడూరు చింతోపు ముంగల దొరువువెంకన్నపాలెం గ్రామాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేసిఇటు విద్యార్థులు అటు తల్లిదండ్రుల అభిమానం పొందారు. ఆయన ద్వారా విద్య అభ్యసించిన వారు రాజకీయ నేతలుగా ఇంజనీర్లుగా బ్యాంక్ ఆఫీసర్లుగా డాక్టర్లుగా ఇతర రంగాలలో ఉండడం విశేషం. గత ఆరు నెలల క్రితం విద్యనభ్యసించిన ఎన్ఆర్ఐ కావులూరు విజయమోహన్ రెడ్డి నెల్లూరు వచ్చి ఘనంగా సన్మానించారు. ఆయన మృతి పట్ల పలువురు పరామర్శించి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

# ఉద్యోగుల ఆరోగ్యమే సంస్థ బలంలం

- ఆర్టీసీ ఉద్యోగులకు ఉచిత మెగా వైద్యపరీక్షలు
- నెల్లూరులో ఆర్టీసీ ఆధ్వర్యంలో భారీ వైద్య శిబిరం ప్రారంభం
- ఉద్యోగులు కుటుంబాల ఆరోగ్య రక్షణకు మెగా మెడికల్ కాంప్
- జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి






**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా డీపీటీఓ ఆఫీసు వద్ద ఆర్టీసీ ఉద్యోగులకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మంగళవారం ఉదయం నుంచే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులు, వారి కుటుంబాల ఆరోగ్య రక్షణ కోసం నెల్లూరు జిల్లాలో నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్యపరీక్షలు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తున్నాయి. ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగులు నిరంతరం ఒత్తిడిలో ఉండే డ్యూటీలు నిర్వహిస్తుండటం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఎక్కువ. అందుకే ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని మెడికవర్, జయభారత్, జీజీహెచ్, ఈఎస్ఐ వంటి ప్రసిద్ధ ఆసుపత్రుల వైద్య నిపుణులతో కలిసి ఈ మెగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేశాం' అని తెలిపారు. ఉద్యోగులతోపాటు వారి కుటుంబ సభ్యులూ ఈ సేవలను పొందేలా అన్ని ఏర్పాట్లు చేశాము. గుండె, కిడ్నీ, నేత్ర, మేడడు, కండరాల సమస్యలు, మహిళా వ్యాధులు, చిన్నపిల్లల పరీక్షలు, బీపీ, షుగర్ వంటి కీలక వైద్య పరీక్షలను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నాం. ఉద్యోగుల ఆరోగ్యం బాగుంటేనే సంస్థ పురోగతి సాధిస్తుంది అన్నది మా ధృడ నమ్మకం' అని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశులు పాల్గొన్నారు. ఈహెచ్ఎస్ కింద గైనకాలజీ, సాధారణ శస్త్రచికిత్స, నేత్ర వైద్యం, డయాలసిస్, కిడ్నీ సంబంధిత చికిత్సలు, నొప్పి, ఉబ్బరానికి సంబంధించిన వైద్య సేవలు, కండరాల విభాగం వంటి అనేక ప్రత్యేక సేవలు అందుబాటులో ఉన్నాయి. ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్, రెగ్యులర్, రిటైర్డ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ సేవలను వినియోగించు కోవడం ఎంతో ఆనందంగా ఉంది' అని ఆయన పేర్కొన్నారు. చివరిగా 'ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ కార్యక్రమాన్ని ప్రతి ఉద్యోగి తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని సురేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ షామిమ్, డిపోటు మేనేజర్ కరీమున్నిసా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

## రహదారి వాహనాలు.. పోక నడక కష్టాలు..





ఆత్మకూరు బస్టాండ్ నుండి రైల్వే అండర్ బ్రిడ్జి రోడ్డు రిపేరు పనులు జరుగుతుండడంతో అటుగా వాహనాలు పోవడం లేదుఆ ప్రాతం మీదుగా ఆసుపత్రుల కొరకు వెళ్ళే పాదచారులు పడుతున్న కష్టాలను చూడండి..

స్టాఫ్ ఫోటోగ్రాఫర్ కోదండపాణి



# అయ్యప్ప స్వామి మండల పూజల మహా దీపారాధన





**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు వేదాయపాలెంలో వేంచేసి ఉన్న వేద శాస్త్ర శ్రీ స్వామి అయ్యప్ప స్వామి దేవస్థానంలో అయ్యప్ప స్వామి వారికి కేరళ సాంప్రదాయ మండల పూజలు మంగళ వారం జరిగింది తొలుత అయ్యప్ప స్వామి వారి నిర్మాల్య దర్శనం పాలాభిషేకం, మహాగణపతి హెూమం, స్వామి వారికి ఉష పూజ, శ్రీ వేలి ఉత్సవం, కలశపూజ,నవకాభిషేకం, ఉచ్చ పూజ, శ్రీ వేలి ఉత్సవం, సాయంత్రం పూలంగి సేవ దర్శనం, మహాదీపారాధన, భగవతి సేవ, అత్తలపూజ, శ్రీవేలి ఉత్సవం, పడి కర్పూర దీపం, హరిహరాసనం అయ్యప్ప స్వామివారి సేవలు కేరళ సాంప్రదాయంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి చెరుకుపల్లి పద్మ నారాయణరెడ్డి సుమతి దంపతులు, ఏందోడు పరంధామిరెడ్డి అరుణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మధ్యాహ్నం అయ్యప్ప స్వాములకు భక్తులకు అన్నదాన కార్యక్రమంకు కాలగంద సుధాకర్- హైమావతి దంపతులు, చెన్నారెడ్డి కరుణాకర్‌రెడ్డి, పద్మమ్మ దంపతులు, ముమ్మారెడ్డి సునీల్ రెడ్డి- భారతి దంపతులు, మురళీకృష్ణ గ్రూప్ ఆఫ్ హెూటల్స్ వారు ఉభయకర్తలుగా వ్యవహరించిగా, రాత్రి అయ్యప్ప స్వాముల బిక్ష కార్యక్రమానికి అర్జున్ నాగ సాయిరాం ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమాలు అన్ని అధ్యక్షులు గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తులవెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య పర్యవేక్షణలో జరిగాయి. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కేజీ శంకరన్, మురళీమోహన్ రెడ్డి, పావలా ప్రసాద్, అశోక్ చంద్ర పలువురు అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరం



**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :** ఆర్‌వీఆర్ ఫాండెషన్, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం జరిగింది. ఔత్సహికులు ఎక్కువగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రెడ్‌క్రాస్ సంస్థ ఉపాధ్యక్షులు జనార్ధన్ రాజు పాల్గొన్నారు. ట్రస్టీ మోహన్ రాజు అందరినీ సమీకరించి రక్తదానం కార్యక్రమం చేపట్టిన ందుకు అభినండించారు. ట్రస్ట్ ద్వారా మున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ట్రష్టి మోహన్ రాజు తెలిపారు.

## అవకాశాల వేదికగా విశ్వవిద్యాలయం

- లక్ష్యసాధన దిశగా సాగాలి : వీసీ




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఘనంగా స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రామ్ (వీఎస్‌యు)లో నూతన విద్యార్థుల కోసం నిర్వహించిన స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రామ్ (ఎస్ఐపీ) మంగళ వారం ఘనంగా జరిగింది. ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ అల్లం శ్రీనివాసరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విశ్వవిద్యాలయాన్ని అవకాశాల వేదికగా వాడుకోవాలని సూచించారు. విద్య కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాభివృద్ధి, సామాజిక బాధ్యత వంటి అంశాలు ఎంతో ముఖ్యం అని తెలిపారు. నూతన విద్యా విధానంలో విద్యార్థి కేంద్రిత అభ్యాసం, పరిశోధనకు ప్రాధాన్యం పెరిగిందని పేర్కొన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యా ప్రస్థానం ఆరంభం నుంచే క్రమశిక్షణ, సమయపాలన అలవర్చుకోవాలన్నారు. పోటీ ప్రపంచంలో కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, సమస్య పరిష్కార నైపుణ్యాలు కీలకమని, సెమినార్లు, వర్క్‌షాప్‌లలో పాల్గొనడం ద్వారా మెరుగైన అవకాశాలు పొందవచ్చని సలహా ఇచ్చారు. డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ ఆర్. ప్రభాకర్ మాట్లాడుతూ.. విద్యార్థుల సంక్షేమానికి వర్సిటీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందన్నారు. చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక, సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.హెచ్. విజయ మాట్లాడుతూ విద్యార్థి జీవితం కొత్త ఆరంభమని, మార్కులకు మాత్రమే పరిమితం కాకుండా విద్యను మనస్తత్వ వికాసానికి సాధనంగా భావించాలని సూచించారు. ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టుల ద్వారా అనుభవాన్ని పెంపొందించుకోవాలని, గురువులకు గౌరవం, సహ విద్యార్థులతో సహకారం కొనసాగించాలని హితవు పలికారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏపీ టూరిజంలో.. జెట్టి బర్త్ డే వేడుకలు



**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :** నగరంలోని ఏపీ టూరిజంలో మంగళవారం అరవింద్ నగర్ నారాయణ జూనియర్ కాలేజీ డీన్ జెట్టి సుధాకర్ రెడ్డి, జోష్ణల ద్వితీయ కుమారుడు విజయభాస్కర్ రెడ్డి ప్రథమ సంవత్సార బర్త్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, బంధువులు, ఆత్మీయులు, సన్నిహితులు, కాలేజీ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

